క్లుప్తంగా

సీఎంను కలిసిన కాంగ్రెస్ నాయకులు



సీఎంను సన్మానిస్తున్న రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, శ్రీ చరణ్‌రెడ్డి

కామేపల్లి: మహబూబాబాద్ పార్లమెంట్ జన జాతర సభలో సీఎం రేవంత్‌రెడ్డిని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే కోరం కనకయ్యలతో కలిసి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ యువజన నాయకుడు రాంరెడ్డి శ్రీ చరణ్‌రెడ్డి శుక్రవారం కలిసి శాలువా కప్పి సన్మానించారు. మహబూబాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్ భారీ మెజార్టీ అందించేందుకు కృషి చేయాలని సీఎం తెలిపినట్లు చెప్పారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



కుట్టు మిషన్, సర్టిఫికెట్ అందిస్తున్న దృశ్యం

ఖమ్మం అర్బన్: మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఖమ్మం కరూర్ వైశ్యా బ్యాంక్ మేనేజర్ తాటికొండ వెంకట సుబ్బారావు అన్నారు. కరూర్ వైశ్యా బ్యాంక్, మై పీపుల్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన మండలంలోని పాండురంగాపురం, ఖమ్మం రూరల్ మండలంలోని గొల్లగూడెం గ్రామాలకు చెందిన మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ అందించారు. అయితే శుక్రవారం శిక్షణ పూర్తి కావడంతో శిక్షణ పొందిన 50 మంది మహిళలకు ఉచిత కుట్టు మిషన్లతో పాటు సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో మైపీపుల్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు మాదిరెడ్డి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యాలకు హాజరైన దయాకర్‌రెడ్డి

నేలకొండపల్లి: మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన వివాహ వేడుకలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు, సొసైటీ డైరెక్టర్ మైశా శంకర్, వెన్నపూసల సీతారాములు, స్వర్ణ, గరిడేపల్లి రామారావు, కొడాలి గోవింద్‌రావు, యర్రబోయిన నర్సయ్య, తేజావత్ శివాజీ, కడియాల నరేష్, రేలా నరసింహారెడ్డి పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయాలి

నేలకొండపల్లి: అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపికైన స్కూళ్లలో విద్యాసంవత్సరం చివరి నాటికి పనులు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. ఖమ్మం నుంచి శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నేలకొండపల్లి మండల అధికారులతో సమావేశమై పలు సూచనలు చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలలో చివరి పనిదినం నాటికి పనులు పూర్తిచేయాలని, పల్లెలో తాగు నీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఎంపీడీఓ ఎం.యర్రయ్య, ఎంపీఓ సీ.హెచ్.శివ, ఎంఈఓ బి.రాములు, ఐకేపీ ఏపీఎం అశోక్‌రాణి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ది ఫ్యామిలీ స్టార్
వినోద	టిల్లు 2
సాయిరాం	గాడ్జిల్లా కాంగ్
ఆదిత్య	గీతాంజలి మళ్లీ వచ్చింది
శ్రీనివాస	మంజుమ్మల్ బాయ్స్

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	26	బచ్చలికూర	5
వంకాయ	24		20
బెండకాయ	20	పాలకూర	2
పచ్చిమిర్చి	40		10
కాకర	46	చుక్కకూర	2
బీర	48		10
దొండ	28	తోటకూర	2
పొట్లకాయ	40		10
చిక్కుడు	76	గోంగూర	2
గోరుచిక్కుడు	30		10
క్యాబేజీ	26	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	25		20
ఆలుగడ్డ	34	కొత్తిమీర	1
చామగడ్డ	40		30
క్యారెట్	36	పుదీన	1
క్యాప్సికం	66		20

-ఖమ్మం వ్యవసాయం

బస్ షెల్టర్ లేకపోవడంతో ఎండలో వేచి ఉన్న ప్రయాణికులు



నిలువ నీడేది..?

కలెక్టరేట్ వద్ద బస్ షెల్టర్ కరువు

- ఏడాదిన్నర కాలంగా నిర్మాణంలో జాప్యం
- భానుడి ప్రతాపానికి జనం విల విల
- రక్షణ కవచాలుగా తువాళ్లు, ఇతర సామగ్రి
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని పలువురి వేడుకోలు

అసలే ఊరు బయట కార్యాలయాలు.. అక్కడ ఏదైనా వాహనం రావాలంటే ఎక్కువ సమయం వేచి చూడాల్సి ఉంటుంది. ఈక్రమాన కలెక్టరేట్ వద్ద బస్ షెల్టర్ నిర్మాణం జరగకపోవటంతో ఏదైనా పనుల నిమిత్తం వస్తున్న వారు ఎండకు మగ్గాల్సిన పరిస్థితి నెలకొంది. బస్ షెల్టర్ల ఏర్పాటులో జాప్యం కారణంగా ప్రయాణికులు మండుటెండలో రహదారిపై నిరీక్షిస్తున్నారు. నూతన కలెక్టరేట్(ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసెస్ కాంప్లెక్స్, ఐడీఓసీ) వద్ద భానుడి ప్రతాపానికి జనం విలవిలలాడుతున్నారు.

– ఖమ్మం సహకారనగర్

నిత్యం వందలాది మంది రాక..

గతేడాది జనవరి 18వ తేదీన ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసెస్ కాంప్లెక్స్(ఐడీఓసీ)ను నాటి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు మరో ఇద్దరు ముఖ్యమంత్రులు, ఒక మాజీమంత్రి అట్టహాసంగా ప్రారంభించారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. అక్కడ కనీస సౌకర్యాలు కల్పించడంలో జిల్లా అధికార యంత్రాంగం విఫలమైందని ఆరోపణలున్నాయి. ఖమ్మం నుంచి వైరా ప్రధాన రహదారిపై ఈ ఐడీఓసీ ఉండగా.. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.

సమస్యలతో సతమతం..

ఐడీఓసీ నిర్మాణం జరిగి సుమారు ఏడాదిన్నర కావస్తుండగా.. నిత్యం ఏదో ఒక సమస్యతో అనేక మంది కలెక్టరేట్‌కు వస్తుంటారు. అలా వచ్చిన వారు బస్సులు, ఆటోల కోసం ఎక్కువ సేపు వేచి చూడాల్సి వస్తుంది. కాని అక్కడ ఎండ వేడి నుంచి రక్షణ పొందేందుకు అధికార యంత్రాంగం ఎలాంటి రక్షణ సౌకర్యాలు కల్పించలేదు. కనీసం తాత్కాలికంగానైనా టెంట్ కూడా ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు చొరవ చూపి కనీసం టెంట్ అయినా ఏర్పాటు చేయిస్తే కొంత మేరకైనా ఉపశమనం లభిస్తుందని పలువురు పేర్కొంటున్నారు.



ఎండ నుంచి రక్షణ పొందుతున్నారిలా....

జంకుతున్న జనం..

కలెక్టరేట్‌కు ఏమైనా పనుల మీద వచ్చే వారు తమ పని పూర్తయిన తర్వాత బస్సులు, ఆటోలు ఇతర వాహనాల కోసం వేచి చూడాల్సి రావటం పెద్ద ప్రహసనంగానే మారింది. కలెక్టరేట్ వద్ద ఎలాంటి బస్ షెల్టర్లు నిర్మాణం లేకపోవటంతో అక్కడకు వచ్చిన వారు ఎండ వేడి నుంచి రక్షించుకునేందుకు తమ వెంట తెచ్చుకున్న తువాళ్లు, ఇతర సామగ్రిని తలపై పెట్టుకొని ఎండ నుంచి ఉపశమనం పొందుతున్నారు. సుమారు నెల రోజులుగా భానుడి ప్రతాపానికి కలెక్టరేట్‌కు వచ్చే వారు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతమనే చెప్పొచ్చు.

అధికారుల అనాసక్తి..

కలెక్టరేట్ ఎదుట బస్ షెల్టర్ నిర్మాణం అవసరం ఉన్న విషయంపై జిల్లా అధికార యంత్రాంగం పట్టించుకోవటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కలెక్టరేట్‌కు పనుల నిమిత్తం వచ్చేవారితో పాటు అందులో పనిచేసే ఉద్యోగులు, ఇతర సిబ్బంది బస్సుల కోసం వేచి చూడాల్సి వస్తున్నా బస్ షెల్టర్ నిర్మాణంపై పెద్దగా ఆసక్తి కనబర్చిన దాఖలాలు లేవని తెలుస్తోంది. ప్రస్తుతం ఎండ వేడి అధికంగా ఉంటున్న క్రమంలో బస్‌షెల్టర్ నిర్మాణం చేయాల్సిన అవసరం ఉందని, ఆలస్యమవుతున్న పక్షంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు అయినా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నీడ కరువైంది..



కలెక్టరేట్ ఎదుట బస్‌షెల్టర్ లేకపోవడంతో నీడ కరువైంది. నిత్యం కలెక్టరేట్‌కు వందల సంఖ్యలో జనంతో పాటు ఉద్యోగులు సైతం వస్తున్నారు. ఈ క్రమంలో బస్‌షెల్టర్ లేకపోవటంతో ఎక్కడ నీడ దొరుకుతుందా అని వెతుక్కోవాల్సిన పరిస్థితి ఉంది. కనీసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు అయినా చేస్తే బాగుంటుంది.

– బి.తిరుపతిరావు, వీవీపాలెం, రఘునాథపాలెం

బస్ షెల్టర్ నిర్మించాలి..



కలెక్టరేట్ ఎదుట బస్‌షెల్టర్ నిర్మించాల్సిన అవసరం ఉంది. నిత్యం కలెక్టరేట్‌కు వస్తున్న వారు తిరుగు ప్రయాణంలో బస్సుల కోసం ఎదురుచూస్తు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రస్తుతం భానుడి ప్రతాపానికి జనం విలవిలలాడుతుండగా.. ఎండ నుంచి రక్షించుకునేందుకు నానా తంటాలు పడాల్సి వస్తుంది.

– స్పందన, ఖమ్మం నగరం

పెద్దమ్మతల్లి ప్రతిష్ఠ మహోత్సవాలు

తిరుమలాయపాలెం: మండలంలోని తెట్టెలపాడు గ్రామంలో ముదిరాజ్‌లు నూతనంగా నిర్మించిన పెద్దమ్మతల్లి దేవాలయంలో శుక్రవారం అమ్మవారి ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పుసులూరి నరేందర్ తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు. బంధుమిత్రుల రాకతో గ్రామంలో ప్రత్యేక సందడి నెలకొంది.



పూజలు చేస్తున్న రాయల నాగేశ్వరరావు

కాంగ్రెస్ నాయకుడికి నివాళి..

తిరుమలాయపాలెం: మండలంలోని రమణాతండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రామావత్ కన్నానాయక్ అనారోగ్యంతో మృతిచెందడంతో శుక్రవారం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..చివరి శ్వాస వరకు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం పనిచేశారన్నారు. మండల జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్, నాయకులు రామసహాయం అరవిందరెడ్డి, ఉన్నం రాజా, మోహన్ అజ్మీరతండా మాజీ సర్పంచ్ బానోత్ రవి, మాజీ ఎంపీటీసీ మూడు వీరన్న తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం



బహుమతులు అందిస్తున్న రాజా, నరసింహారెడ్డి

కామేపల్లి: క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, క్రీడాకారులు వాటిని సమానంగా తీసుకున్నప్పుడే భవిష్యత్‌లో రాణించగలరని బోడేపూడి ట్రస్ట్ నిర్వాహకుడు బోడేపూడి రాజా, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి అన్నారు. పొన్నేకల్ గ్రామంలో బోడేపూడి ట్రస్ట్ ఆధ్వర్యాన నిర్వహించిన కామేపల్లి, కారేపల్లి, డోర్నకల్, గార్ల మండలాల క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ముగియడంతో విజేతలకు బహుమతులు అందించారు. ఇందులో డోర్నకల్ మండలం ఎన్నారం టీం ప్రథమ బహుమతి రూ.15 వేలు, పొన్నేకల్ టీం ద్వితీయ బహుమతి రూ.8 వేలుతో పాటు మెమొంటోలు దక్కించుకున్నాయి. ఈ కార్యక్రమంలో వల్లభనేని అశోక్, దండుగల నాగయ్య, అనుమంచినేని రమేష్, సుమన్‌నాయక్, మాలపోలు గోపికృష్ణ, సునీల్ భాను, కిన్నెర ప్రశాంత్, కనకం శ్రీకాంత్, దాసరి మధు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎన్నిక

ఖమ్మంలీగల్: ఖమ్మం జిల్లా బార్ అసోసియేషన్ నూతన కమిటీ శుక్రవారం న్యాయవాదుల ఎగ్జిక్యూటివ్ కమిటీని ప్రకటించింది. ఈ కమిటీలో షేక్ లాల్‌జాన్‌పాషా, తిరుపతిరావు, వెంకటేశ్వరరావు గుప్తా, తన్నీరు పాపయ్య, పులి నరసింహారావు, వెంకయ్య చౌదరి, కృష్ణ మోహన్, కొప్పుల రవికుమార్, సంపత్ కుమార్, కంచర్ల విజయ్‌కుమార్, దారావత్ ప్రసాద్, జడ సురేష్, అవుల అనురాధ, వెంకటరమణాచారి, వేల్పుల సురేష్, దుర్గారాణి, రామానుజం మహేష్, స్పందనా రెడ్డి, ముమ్మాడి సతీష్‌లకు స్థానం కల్పించారు. ఈ కమిటీ సభ్యులు జిల్లా బార్ అసోసియేషన్‌తో కలిసి న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేస్తామని, జిల్లా కోర్టులో దీర్ఘ కాలంగా పెండింగ్ ఉన్నా సమస్యలతో పాటు జూనియర్ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు, తమకు కమిటీలో అవకాశం కల్పించిన జిల్లా బార్ అసోసియేషన్ బాధ్యులకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

'ఉపాధి' చట్టాన్ని కాపాడేందుకు ఉద్యమించాలి

నేలకొండపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టాన్ని కాపాడేందుకు క్షేత్రస్థాయిలో ఉద్యమించాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం నేలకొండపల్లిలో జరిగిన ఉపాధి హామీ పనులను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కొలతలతో సంబంధం లేకుండా రోజుకు రూ.700 ఇవ్వాలని, వారానికోసారి మస్టర్ ప్లే స్లిప్‌లు ఇవ్వడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. తిమ్మిడి హనుమంతరావు, చిర్రా భిక్షం, పగిడికత్తుల రామదాసు, అశోక్, లింగయ్య, భారతమ్మ, రేణుకమ్మ, లింగయ్య, వీరస్వామి, సైదయ్య, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

నేడు కరెంట్ కోత

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ సబ్ స్టేషన్లు, లైన్ల నిర్వహణ, మరమ్మతు పనుల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆ శాఖ అధికారులు శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. 11 కేవీ కొత్తూరు ఫీడర్ మరమ్మతు పనుల కారణంగా ఉదయం 7 నుంచి 9 గంటల వరకు శ్రీరాంనగర్ రోడ్ నంబర్ 10, రోడ్ నెంబర్ 1లో, జెమినీ వాటర్ ప్లాంట్, బొమ్మన స్కూల్ ఏరియాల్లో 9 నుంచి 12 గంటల వరకు హార్వెస్ట్ స్కూల్ ఏరియా, రామచంద్రయ్యనగర్, ఎస్‌బీఐటీ, చెరువుబజార్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఖమ్మం టౌన్-2 ఏడీఈ రమేష్ తెలిపారు. 11 కేవీ కొత్తగూడెం ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి 12 గంటల వరకు కొత్తగూడెం, శివపురం ప్రాంతాల్లో కరెంట్ కోత విధించబడుతుందన్నారు. ఖమ్మం టౌన్-1 గాంధీచౌక్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఎమ్మార్వో ఆఫీసు, సాయిరాం థియేటర్ రోడ్, మోతీనగర్, బొక్కలగడ్డ, పంపింగ్‌వెల్ రోడ్, ఫిల్టర్ బెడ్, పంపింగ్‌వెల్ ఆటోస్టాండ్, పెద్దమ్మ తల్లి గుడి, గాంధీచౌక్, పీఎస్‌ఆర్ రోడ్, సుందర్ మ్యాక్స్ థియేటర్ రోడ్ గుట్టల బజార్ కన్యకాపరమేశ్వరీ దేవాలయం రోడ్, జహీర్‌పుర తండా, వెంకటలక్ష్మి టాకీస్ రోడ్, గాంధీనగర్, కొత్త సీతారాములు రోడ్, సుందరయ్యనగర్, పత్తియార్డు, బోస్‌బొమ్మ సెంటర్, జహీర్‌పుర, మంచికంటినగర్-2 ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ ఆపరేషన్స్ మాలిక తెలిపారు. అలాగే టౌన్-3 పరిధిలోని ఇల్లెందు క్రాస్ రోడ్ 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా ఉదయం 7 నుంచి 10 గంటల వరకు బైపాస్ రోడ్, వేణుగోపాల్‌నగర్, బాలాజీనగర్, యూపీహెచ్ కాలనీ, విజయ్‌నగర్, కాలనీ, బ్యాంకు కాలనీ, ఎన్టీఆర్ సర్కిల్, వీడీవోస్ కాలనీ, కవిరాజ్‌నగర్, గట్టయ్యసెంటర్, ప్రశాంతినగర్, వైరా రోడ్, జెడ్పీసెంటర్, జమ్మిబండ, కోర్టు ఏరియా, సీక్వెల్ రోడ్‌లలో విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని ఏఈ బీ తావుర్యా తెలిపారు.

అల్లీపురం సబ్‌స్టేషన్ పరిధిలో..

ఖమ్మం అర్బన్: మండలంలోని అల్లీపురం సబ్ స్టేషన్ పరిధిలోని అల్లీపురం, కొత్తగూడెం, పుట్టకోట, రుద్రంకోట ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు, 11 కేవీ కొత్తగూడెం ఫీడర్‌పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కరెంట్ ఉండదని ఏఈ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు.

రేపు నెల నెలా వెన్నెల

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు 81వ నెల నెలా వెన్నెల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అమరజీవి అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు మోటమర్రి జగన్మోహన్‌రావు, సుబ్రమణ్యకుమార్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నాటిక ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

రాములోరికి మహా పుష్పాభిషేకం

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని గాంధీచౌక్‌లో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా గురువారం శ్రీసీతారామచంద్ర స్వామివార్లకు మహా పుష్పాభిషేకం, సదస్యం నిర్వహించారు. నిర్వాహకులు, భక్తులు తీరొక్క పూలతో స్వామివార్లకు పుష్పాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు వేములపల్లి వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు వేములపల్లి నగేష్, కార్యదర్శి వజ్రపు రామ్మోహన్‌రావు, ఉపాధ్యక్షులు తెల్లాకుల సాంబశివరావు, ఉమా పూర్ణచందర్‌రావు, సహాయ కార్యదర్శులు ఆత్మకూరి నవీన్, నోముల శ్రీనివాసరావు, కోశాధికారి అర్వపల్లి నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పుష్పాభిషేకం చేస్తున్న భక్తులు

వైభవంగా శివపార్వతుల కల్యాణం



కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

కామేపల్లి: 16 రోజుల పండుగ సందర్భంగా మండలంలోని ఊట్కూర్ గ్రామంలో శుక్రవారం శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం శివపార్వతుల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించగా.. మహిళలు కుంకుమ పూజలు, హనుమాన్ చాలీసా చేశారు. గ్రామస్తులంతా పాల్గొని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

మూడోసారి ప్రధాని మోదీనే..

ఖమ్మం మామిళ్లగూడెం: మూడోసారి కూడా ప్రధాని మోదీ కావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర నాయకుడు మేకల నాగేందర్ అన్నారు. ఖమ్మం ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం ఖమ్మంలోని 50, 51, 58 డివిజన్లలో నిర్వహించిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సామాజిక న్యాయం బీజేపీతోనే సాధ్యమన్నారు. కేంద్ర నిధుల ద్వారా జిల్లా అభివృద్ధికి పాటు పడే వినోద్‌రావును అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సుధాకర్, టూటౌన్ ప్రధాన కార్యదర్శి మహేందర్‌సింగ్, లలిత, టూటౌన్ ఉపాధ్యక్షులు కృష్ణాచారి, రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న నాగేందర్

బాల్య వివాహాలను ప్రోత్సహించొద్దు

కూసుమంచి: ఆధునిక సమాజంలో కూడా కొందరు బాల్య వివాహాలు చేస్తున్నారని, ఇటువంటి వివాహాలను ప్రోత్సహించవద్దని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమ అన్నారు. శుక్రవారం మండలంలోని మంగళితండాలో బాల్య వివాహాలు, లింగ వివక్షత, భ్రూణ హత్యలపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, భ్రూణ హత్యలు సమాజానికి ప్రమాదకరంగా మారాయన్నారు. కడుపులోనే శిశువులను చిదిమేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భ్రూణ హత్యలకు పాల్పడినా, లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, గ్రామ కార్యదర్శి ఉపేందర్, అంగన్‌వాడీ టీచర్లు కవిత, నీలమ్మ, భద్రమ్మ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న మల్లిబాబు, తదితరులు

రఘునాథపాలెం: బీమా చేయించడం ద్వారా కుటుంబాలకు ఆర్థిక భద్రత ఉంటుందని డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్ తెలిపారు. మండలంలోని పంగిడికి చెందిన భూక్యా కబీర్ రెండేళ్ల క్రితం బీమా చేయించగా, ఇటీవల ఆయన అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బీమా సంస్థ నుంచి మంజూరైన రూ.10లక్షల చెక్కును మల్లిబాబు, బీమా సంస్థ అధికారి సురేష్ శుక్రవారం అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కుంచాల చిరంజీవి, పిన్ని సురేష్, బానోత్ నరసింహ నాయక్, మేకల మల్లికార్జున్‌రావు, రాంబాబు, వెంకటకృష్ణ, నాగరాజు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మాజీ మంత్రి జన్మదిన వేడుకలు



పువ్వాడను సన్మానించి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ, ఎంపీ

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, టౌన్ కమిటీ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ కేక్ కట్ చేయగా పలువురు శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు తాత మధుసూదన్‌లు పువ్వాడను శాలువాతో సత్కరించగా.. మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలపై దాడి కుట్ర గర్హనీయం

ఖమ్మంవన్‌టౌన్/నేలకొండపల్లి: రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జరిగిన దాడి కుట్ర గర్హనీయమని డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, కార్పొరేటర్లు పేర్కొన్నారు. ఖమ్మంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని కొందరు తుమ్మలపై దాడికి రెక్కీ నిర్వహించడం దారుణమని తెలిపారు. అయినా ఖమ్మం ప్రజలు భారీ మెజార్టీతో తుమ్మలను గెలిపించి బీఆర్‌ఎస్ ఆగడాలకు చరమగీతం పాడారని చెప్పారు. కాగా, కుట్రలో పాలుపంచుకున్న వారిపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. కార్పొరేటర్లు, నాయకులు పాలెపు విజయ, పాకాలపాటి విజయలక్ష్మి, రాపర్తి శరత్, దొడ్డా నగేష్, రావూరి సైదుబాబు, చావా నారాయణరావు, పోట్ల వీరేందర్, బాణాల లక్ష్మణ్, మందడపు మనోహర్, నల్లమల ఆనంద్, ఆశ్రిఫ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, దాడి కుట్రపై విచారణ జరిపించాలని కార్పొరేటర్ మిక్కిలినేని నరేందర్, నాయకులు పత్తి శ్రీనివాస్, చంద్ర రాంబాబు, నల్లమల ఆనంద్, నల్లమల వేణుచౌదరి తదితరులు పోలీసు అధికారులను కోరారు. కాగా, తుమ్మలపై దాడి కుట్రలో పాలుపంచుకున్న వారిని అరెస్ట్ చేయాలని నేలకొండపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాలేరు డివిజన్ కాంగ్రెస్ నాయకుడు రావెళ్ల కృష్ణారావు డిమాండ్ చేశారు.

బాధ్యతలు స్వీకరించని ప్రత్యేకాధికారి

నేలకొండపల్లి: పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ముగిశాక ప్రజలకు అందుబాటులో ఉండేందుకు స్పెషల్ ఆఫీసర్లను నియమించారు. ఇందులో భాగంగా మొదట నేలకొండపల్లి మండలం కోనాయిగూడెం, ఆచార్లగూడెం, ఆరెగూడెం, కోరట్లగూడెం గ్రామాలకు నెల క్రితం ఎంపీడీఓ, ఎంపీఓ వ్యవసాయాధికారి ప్రత్యేకాధికారి వ్యవహరించారు. కాగా వీరిపై భారం తగ్గించేందుకు నాలుగు పంచాయతీలకు కలిపి నేలకొండపల్లి విద్యుత్ శాఖ ఏడీ కె.రామారావును స్పెషల్ ఆఫీసర్‌గా నియమించారు. కానీ ఇప్పటివరకు సదరు అధికారి బాధ్యతలు స్వీకరించలేదు. తనది అత్యవసర సర్వీస్ కావడం.. కేటాయించిన నాలుగు గ్రామాలు కూడా తన క్లస్టర్ కాదంటూ ఆయన ముందుకు రావడం లేదని తెలిసింది. దీనికి తోడు ఇతరులకు సైతం విధులు కేటాయించకపోవడంతో గ్రామాల్లో పనులు ముందుకు సాగడం లేదు. మల్టీపర్పస్ వర్కర్ల జీతాలు, తాగునీటి పైపులైన్ల మరమ్మతులకు నిధులు డ్రా చేయాలంటే పంచాయతీ కార్యదర్శి, స్పెషల్ ఆఫీసర్ సంతకాలు చేయాల్సి ఉంది. ప్రస్తుతం తాగునీటి బోర్లు, మోటార్ల మరమ్మతు అత్యవసరంగా చేయాల్సి ఉంది. కానీ ప్రత్యేకాధికారి లేకపోవడంతో ప్రజల ఒత్తిడి తట్టుకోలేక కార్యదర్శులు అప్పులు తెచ్చి వెచ్చిస్తున్నారు. ఈ విషయమై ఎంపీఓ సీ.హెచ్.శివ ను వివరణ కోరగా... ప్రత్యేకాధికారి బాధ్యతలు స్వీకరించని విషయం వాస్తవమేనని తెలిపారు. జిల్లా అధికారులు ఆదేశాలు మేరకు నిర్ణయాలు ఉంటాయని పేర్కొన్నారు.



కోనాయిగూడెంలో మోటార్‌కు మరమ్మతు చేస్తున్న దృశ్యం